జ్వాల తెలుగు న్యూస్
RNI NO: TELTEL/2023/88524
# మెదక్ టుడే
MEDAK TODAY
తెలుగు దిన పత్రిక...
26 మార్చి 2026 మెదక్ పేజీలు :4 వెల రూ.:2 ఎడిటర్: సిహెచ్. శివకుమార్ సంపుటి 02 సంచిక 116

## బ్యాంకింగ్ బకాసురులు

**హర్యానాలో రూ.160 కోట్ల మున్సిపల్ నిధులు స్వాహా!**



2

ప్రభుత్వ ఖజానాకు కన్నం వేయడంలో కిలాడీలు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఐడీఎఫ్‌సీ బ్యాంకులో జరిగిన రూ.590 కోట్ల భారీ స్కామ్ మరువకముందే, ఇప్పుడు కోటక్ మహీంద్రా బ్యాంకులో రూ.160 కోట్ల మున్సిపల్ నిధులు మాయమవ్వడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అసలు బ్యాంకు ఖాతాలో ఉండాల్సిన కోట్లాది రూపాయలు రాత్రికి రాత్రే ఎలా మాయమయ్యాయి?

మూసీ తీరాన....

# ‘ఓంకార’ నాదం



**రూ. 700 కోట్లతో ఆధ్యాత్మిక వైభవం!**
**రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గర్భాలయం**
**మత సామరస్యానికి ప్రతీకగా 55 కి.మీ.ల కారిడార్..**
**28న సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన**

**హైదరాబాద్, మార్చి 25:** నగర జీవనాడి మూసీ నది కేవలం మురికి కాలువగా కాకుండా, భవిష్యత్తులో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా విరాజిల్లబోతోంది. మూసీ పరివాహక ప్రాంతాన్ని మత సామరస్యానికి వేదికగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా గండిపేట సమీపంలోని మంచిరేవులలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ‘ఓంకారేశ్వర’ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టనుంది.

చారిత్రక వారసత్వానికి పునర్జీవం

గండిపేట జలాశయానికి దిగువన, ప్రకృతి ఒడిలో ఉన్న గుట్టపై కాకతీయుల కాలం నాటి వీరభద్రస్వామి ఆలయం (800 ఏళ్ల చరిత్ర), చాళుక్యులు ప్రతిష్టించిన మచిలేశ్వర శివలింగం (1400 ఏళ్ల చరిత్ర) ఉన్నాయి. ఈ పురాతన ఆలయాలను పునరుద్ధరించడంతో పాటు, వాటి చెంతనే 8 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా ఓంకారేశ్వర మందిరాన్ని నిర్మించనున్నారు. కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనల మేరకు ఈ ఆలయ నిర్మాణ శైలిని ఖరారు చేశారు.

యాదగిరిగుట్ట తర్వాత తెలంగాణలో అత్యంత భారీ గర్భాలయం కలిగిన ఆలయంగా ఓంకారేశ్వర స్వామి ఆలయం నిలవబోతోంది.

నిర్మాణ కొలతలు: గర్భాలయ గోపురం 64 అడుగుల ఎత్తు, 14 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పుతో నిర్మించనున్నారు.

ఆకర్షణ: ఎత్తయిన గాలిగోపురం, విశాలమైన మండపాలు

మిగతా 2లో

## వందేమాతరం దేశభక్తి ‘పిలుపు’ మాత్రమే..

**‘నిబంధన’ కాదు! సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

జాతీయ గేయం ‘వందేమాతరం’ ఆలపించడంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టతనిచ్చింది. అధికారిక కార్యక్రమాల్లో ఈ గేయం పాడటం తప్పనిసరి కాదని, కేంద్రం జారీ చేసిన సర్క్యులర్ కేవలం ఒక ‘సలహా’ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.


2



# ఇరాన్ వ్యూహం

**అమెరికాకు షరతుల యుద్ధం!**
**హార్ముజ్ జలసంధిపై ‘టాక్స్’ అధికారం**
**గల్ఫ్ నుంచి అమెరికా వైదొలగాలి**
**శాంతి చర్చలకు టెహ్రాన్ పెట్టిన ‘డెడ్ లైన్’ ఇదేనా?**

2

దశాబ్దాలుగా ఉప్పు నిప్పులా ఉన్న అమెరికా-ఇరాన్ సంబంధాల్లో అనూహ్య మలుపు చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విసిరిన శాంతి పాచికకు ఇరాన్ తనదైన శైలిలో స్పందించింది. నిన్నటి వరకు “చర్చల ప్రసక్తే లేదు” అంటూ భీష్మించుకు కూర్చున్న ఇరాన్, ఇప్పుడు అగ్రరాజ్యం ముందు కఠినమైన షరతుల చిట్టాను ఉంచింది.



# అక్రమార్కుల ఆటలు సాగనివ్వం

**యుద్ధం సాకుతో దోపిడీ చేస్తే ఊరుకోం..**
**బ్లాక్ మార్కెట్ దందాలపై ఉక్కుపాదం**
**ఇంధన సెగపై సీఎం సంచలన సమీక్ష**
**నో స్టాక్” బోర్డులు పెడితే లైసెన్సులు రద్దు..**
**“రైతన్నలకు నా హామీ..**
**యూరియాకు ఢోకా లేదు**
**వదంతులు నమ్మొద్దు : సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ మార్చి 25** “పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుంటే.. ఇక్కడ కొందరు దందాలు చేయాలని చూస్తున్నారు. యుద్ధం పేరు చెప్పి సామాన్యుడిని ఆగం చేస్తే సహించేది లేదు” అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో పెట్రోల్, గ్యాస్, యూరియా నిల్వలపై సచివాలయంలో జరిగిన అత్యవసర హై-లెవల్ మీటింగ్‌లో సీఎం గర్జించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కీలక వ్యాఖ్యలు ఇవే:

**“స్టిక్కర్ బాబుల మాటలు నమ్మకండి.. మా దగ్గర స్టాక్ ఉంది!”**

“రాష్ట్రంలో పెట్రోల్ అయిపోతుందంటూ సోషల్ మీడియాలో కావాలని కొన్ని శక్తులు వదంతులు వ్యాప్తి చేస్తున్నాయి. ప్రజలు కంగారు పడి కిలోమీటర్ల మేర క్యూలు కట్టడం వల్ల అనవసరపు ట్రాఫిక్ జామ్ అవుతోంది. మన దగ్గర సరిపడా నిల్వలు ఉన్నాయి. మీరు ఫుల్ ట్యాంకులు చేయించుకోవాల్సిన అవసరం లేదు. వదంతులు నమ్మే వాళ్లకు భరోసా ఇవ్వండి..

మిగతా 2లో

## కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి ‘జై భీమ్’



**పార్టీ ఫిరాయింపులపై మాజీ ఎమ్మెల్సీ నిప్పులు!**
**రాహుల్ గాంధీ విధానాలకు తూట్లు పొడుస్తున్నారు..**
**20 నెలల మానసిక వేదనకు ముగింపు**

**జగిత్యాల, మార్చి 24:** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోసిన సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర నాయకత్వంపై, పార్టీ హైకమాండ్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన రాజీనామాకు గల కారణాలను వివరిస్తూ.. పార్టీలో తాను అనుభవించిన అంతర్మథనాన్ని పంచుకున్నారు.

**రాహుల్ గాంధీ ఆశయాలకు విరుద్ధం**

పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో ‘జై భీమ్–జై సంవిధాన్’ నినాదంతో రాజ్యాంగ రక్షణ గురించి మాట్లాడుతుంటే, తెలంగాణలో దానికి పూర్తి విరుద్ధంగా పాలన సాగుతోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా రాహుల్ గాంధీ నైతిక విలువలను రాష్ట్ర నాయకత్వం తుంగలో తొక్కిందని ఆయన మండిపడ్డారు.

**మానసిక వేదన భరించలేకే..**

“తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న సంతోషం కూడా లేకుండా చేశారు” అంటూ జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 నెలలుగా పార్టీలో తాను తీవ్రమైన మానసిక వేదనకు గురయ్యానని, తన కష్టార్జితంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. తనను పదేళ్లు ఇబ్బంది పెట్టిన వారికే పెద్దపీట వేయడం సహించలేకపోతున్నానని స్పష్టం చేశారు.

సంజయ్ కుమార్ చేరికతో తెగిపోయిన బంధం

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలోకి తీసుకోవడమే జీవన్ రెడ్డి రాజీనామాకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. “పదేళ్లపాటు మమ్మల్ని ఇబ్బందులకు గురిచేసిన వారిని తీసుకువచ్చి పార్టీలో

మిగతా 2లో

## అధికారం కోసం అబద్ధాల మానిఫెస్టోనా

**కాంగ్రెస్ ‘హామీల గాలి కోటలు’ బట్టబయలు**
**ఆశా వర్కర్ల వేతనం.. కేసీఆర్ కిట్ బందుపై**
**అసెంబ్లీలో హరీశ్ రావు ధ్వజం**


2

‘ఓట్లు దండుకోవడానికి ఆకాశమంత హామీలు ఇచ్చారు.. తీరా గద్దెనెక్కిన తర్వాత ఆశలన్నీ అడియాసలు చేశారు” అంటూ బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. శాసనసభ వేదికగా రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగట్టారు

# ఆకాశ మార్గంలో ‘వికసిత భారత్’

**రూ. 28,840 కోట్లతో ఉడాన్ 2.0 విప్లవం!**
**కేంద్ర కేబినెట్ మెగా ప్లాన్: సామాన్యుడికి రెక్కలు..**
**దేశానికి డిజిటల్ రక్షణ!**

**ఢిల్లీ మార్చి 25:** ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బుధవారం తీసుకున్న నిర్ణయాలు భారత విమానయాన మరియు భద్రతా రంగాల్లో కొత్త చరిత్రకు నాంది పలికాయి. ప్రధా నంగా రెండు విభ ాగాలుగా ఈ నిర్ణ యాలను విశ్లేషించవచ్చు:

**మిషన్ ఉడాన్ 2.0: ‘గాలిలో’ కొత్త నగరాలు!**

సామాన్య పౌరుడిని విమానం ఎక్కించాలనే లక్ష్యంతో రూపొందించిన ‘మోడిఫైడ్ ఉడాన్’ పథకం ఇప్పుడు

మిగతా 2లో



## మూసీ తీరాన 'ఓంకార' నాదం

భక్తులకు కనువిందు చేయనున్నాయి.
**శివ రూపం:** నది మధ్యలో నిర్మించే చిన్నపాటి ఆనకట్ట వద్ద 100 అడుగుల భారీ శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.
నాలుగు మతాల సమాహారం: సర్వమత సౌభ్రాతృత్వం
హైదరాబాద్ పశ్చిమ దిశ నుంచి తూర్పున ప్రతాపసింగారం వరకు 55 కిలోమీటర్ల మేర సాగే మూసీ ప్రవాహంలో నాలుగు ప్రధాన మతాల ప్రార్థనా మందిరాలను ప్రభుత్వం నిర్మించనుంది:
**మంచిరేవుల:** ఓంకారేశ్వర ఆలయం (హిందూ)
**పురానాపూల్:** భారీ మసీదు (ఇస్లాం)
**నాగోల్:** చర్చి (క్రైస్తవం)
**గౌలిగూడ:** గురుద్వారా (సిక్కు)
పర్యాటక హంగులు.. మెరుగైన రవాణా
ఈ ప్రాజెక్టును కేవలం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు.
**రవాణా:** ఔటర్ రింగ్ రోడ్ నుంచి నేరుగా ఆలయానికి చేరుకునేలా విశాలమైన రహదారి, 2000 వాహనాలకు సరిపడేలా పార్కింగ్ సౌకర్యం.
**వినోదం:** నిల్వ ఉంచిన నదీ జలాల్లో బోటింగ్ సౌకర్యం, చుట్టూ పచ్చని పార్కులు.
**భాగస్వామ్యం:** రూ. 700 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో దాతలు, ప్రైవేటు సంస్థలను భాగస్వాములను చేయనున్నారు. ఈ నెల 28వ తేదీన ఉదయం 8:30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ బృహత్తర కార్యానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో శృంగేరి పీఠం ప్రతినిధులు సైతం పాల్గొననున్నారు.

## కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి 'జై భీమ్'..

చేర్చుకుంటారా? ఇది కార్యకర్తల మనోభావాలను దెబ్బతీయడమే. రాష్ట్ర కాంగ్రెస్ తీసుకుంటున్న ఇటువంటి అనాలోచిత నిర్ణయాలు జాతీయ స్థాయిలో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయి." – జీవన్ రెడ్డి
**బాధగా ఉన్నా తప్పడం లేదు..**
కాంగ్రెస్‌ను వీడటం వ్యక్తిగతంగా తనకు ఎంతో బాధ కలిగిస్తున్నప్పటికీ, ఆత్మగౌరవం కోసం ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని ఆయన వివరించారు. రాష్ట్ర నాయకత్వం అనుసరిస్తున్న తీరు 'జై బాపు' నినాదానికి తూట్లు పొడిచేలా ఉందని విమర్శించారు. ఆయన తన మనసులోని మాటను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

## "అధికారం కోసం అబద్ధాల మానిఫెస్టోనా

**హైదరాబాద్ మార్చి 25:** "ఓట్లు దండుకోవడానికి ఆకాశమంత హామీలు ఇచ్చారు.. తీరా గద్దెనెక్కిన తర్వాత ఆశలన్నీ అడియాసలు చేశారు" అంటూ బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. శాసనసభ వేదికగా రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ ఆయన సంధించిన అస్త్రాలు ఇవే:
**"ఆశా వర్కర్ల రూ. 18 వేల జీతం ఎటు పోయింది?"**
కాంగ్రెస్ తన ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీని హరీష్ రావు గుర్తు చేస్తూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టారు. "ఎన్నికల ప్రచారంలో ఆశా వర్కర్లకు నెలకు రూ. 18 వేలు ఇస్తామని ఊదరగొట్టారు. అధికారం వచ్చి ఇన్ని నెలలైనా ఒక్క రూపాయి పెంచలేదు సరికదా, కనీసం వారి మొర ఆలకించే నాథుడే లేడు.""గత వారం రోజులుగా ఆశా వర్కర్లు గొంతు చించుకుని ధర్నా చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆ రూ. 18 వేల వేతనం ఎప్పటి నుంచి అమలు చేస్తారో డేట్ చెప్పండి!" అని నిలదీశారు.
**"కేసీఆర్ కిట్ బంద్.. గర్భిణీలకు అన్యాయం!"**
తెలంగాణలో శిశు మరణాలను తగ్గించి, ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచిన 'కేసీఆర్ కిట్' పథకం నిలిపివేతపై హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్‌ను అటకెక్కించారు. దీనివల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ఏకంగా 20% తగ్గాయి. అంటే పేద గర్భిణీలు మళ్లీ ప్రైవేట్ దోపిడీకి గురవుతున్నారు. "పథకం బంద్ చేసి పేదలకు అన్యాయం చేయడం మీ మార్క్ పాలనా? కేసీఆర్ కిట్‌ను ఎప్పటి నుంచి తిరిగి ప్రారంభిస్తారో సమాధానం చెప్పాలి."
**"అలవిమాలిన హామీలతో మోసం!"**
ప్రభుత్వ తీరుపై హరీష్ రావు పదునైన విమర్శలు గుప్పించారు"ప్రభుత్వ ఆసుపత్రులను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ శక్తులకు మేలు చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. "మాట తప్పడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య.. ఆశా వర్కర్ల కడుపు కొట్టి మీరు పాలిస్తారా?"హరీష్ రావు సంధించిన ఈ ప్రశ్నలు సభలో పెను దుమారం రేపాయి. ముఖ్యంగా గణాంకాలతో సహా ఆయన చేసిన విమర్శలకు ప్రభుత్వం ఎలా సమాధానం ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఆశా వర్కర్ల సమస్యపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని ఆయన స్పష్టం చేశారు.

## అక్రమార్కుల ఆటలు సాగనివ్వం

వ్యాప్తి చేసే వాళ్ల తాట తీయండి."
**"కృత్రిమ కొరత సృష్టిస్తే పీడీ యాక్ట్ తప్పదు!"**
"పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల యజమానులకు నా సూటి హెచ్చరిక.. స్టాక్ పెట్టుకుని కూడా 'నో స్టాక్' బోర్డులు పెడితే మీ లైసెన్సులు రద్దు చేయడమే కాదు, పీడీ యాక్ట్ కింద లోపల వేస్తాం. సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టాలని చూసే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రతి బంకులో స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేయాలి."
**"యుద్ధం ఎఫెక్ట్ పడకుండా 'వ్యూహాత్మక నిల్వలు'!"**
"ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు రావచ్చు.. అందుకే మేము ముందుగానే అప్రమత్తమయ్యాం. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రానికి రావలసిన కోటాలో ఎలాంటి కోత పడకుండా చూస్తున్నాం. యుద్ధం ఎక్కడైనా కావచ్చు.. తెలంగాణలో మాత్రం ఇంధన సరఫరా ఆగదు."
**"రైతన్నలకు నా హామీ.. యూరియాకు ఢోకా లేదు!"**
"పెట్రోల్ కోసం నగర ప్రజలు ఎంత ఆందోళన చెందుతున్నారో.. ఎరువుల కోసం మా అన్నదాతలు అంతే ఆవేదన చెందుతున్నారు. యూరియా సహా అన్ని రకాల ఎరువుల బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంది. విదేశీ ముడిసరుకు ఆగిపోయినా సరే.. వచ్చే సీజన్‌కు సరిపడా నిల్వలు మన గోదాముల్లో ఉన్నాయి. రైతులు కంగారు పడి బ్లాక్‌లో కొనవద్దు."పెట్రోల్ డిపోల నుంచి బంకుల వరకు ప్రతీ అడుగుపై నిఘా ఉంచాలి. గ్యాస్ లేదా పెట్రోల్ అధిక ధరకు అమ్మితే ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక నంబర్ కేటాయింపు. భద్రతా కారణాల దృష్ట్యా మరియు దుర్వినియోగాన్ని అరి కట్టేందుకు క్యాన్లలో పెట్రోల్ అమ్మకాన్ని నిలిపివేయాలని ఆదేశం."ప్రభుత్వం నిద్రపోవడం లేదు.. మేం మేల్కొనే ఉన్నాం. ప్రజలు ప్రశాంతంగా ఉండండి. మీ అవసరాలకు తగినంత ఇంధనం అందు బాటులో ఉంటుంది. అక్రమార్కుల ఆటలు సాగనివ్వం!" అని రేవంత్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు.

## ఇరాన్ వ్యూహం

**టెహ్రాన్/వాషింగ్టన్ మార్చి 25:** దశాబ్దాలుగా ఉప్పు నిప్పులా ఉన్న అమెరికా–ఇరాన్ సంబంధాల్లో అనూహ్య మలుపు చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విసిరిన శాంతి పాచికకు ఇరాన్ తనదైన శైలిలో స్పందించింది. నిన్నటి వరకు "చర్చల ప్రసక్తే లేదు" అంటూ భీష్మించుకు కూర్చున్న ఇరాన్, ఇప్పుడు అగ్రరాజ్యం ముందు కఠినమైన షరతుల చిట్టాను ఉంచింది. అయితే, ఈ షరతుల వెనుక ఇరాన్ తన ఆర్థిక వ్యవస్థను కాపాడుకునే బలమైన వ్యూహం ఉన్నట్లు కనిపిస్తోంది. అమెరికాతో టేబుల్ మీద కూర్చోవాలంటే ఇరాన్ పెట్టిన మొదటి షరతు.. గల్ఫ్ దేశాల్లో తిష్టవేసిన అమెరికా సైనిక స్థావరాలను తక్షణమే ఎత్తివేయడం. ప్రాంతీయ భద్రతలో అమెరికా జోక్యం తమకు ఆమోదయోగ్యం కాదని ఇరాన్ స్పష్టం చేసింది. దీనితో పాటు, ఇరాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్న కఠినమైన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని పట్టుబడుతోంది. కేవలం ఆంక్షల తొలగింతే కాకుండా, గత యుద్ధాలు మరియు దౌత్యపరమైన ఒత్తిళ్ల వల్ల తమ దేశానికి కలిగిన ఆర్థిక నష్టానికి భారీ పరిహారం చెల్లించాలని కూడా ఇరాన్ డిమాండ్ చేయడం గమనార్హం.
ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును మరింత బిగించాలని చూస్తోంది. ఈ మార్గం ద్వారా ప్రయాణించే నౌకల నుంచి పన్ను వసూలు చేసే పూర్తి అధికారం తమకే ఉండాలని కోరుతోంది. ఇది జరిగితే, ప్రపంచ ఇంధన సరఫరాపై ఇరాన్ అప్రకటిత నియంత్రణ సాధించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను అడ్డుకోవాలని అమెరికాను కోరడం ద్వారా తన ప్రాంతీయ మిత్రపక్షాలను రక్షించుకునే ప్రయత్నం చేస్తోంది.
**అడుగు వెనక్కి: అణు, క్షిపణి రంగాల్లో భారీ రాయితీలు**
ఒకవైపు కఠిన షరతులు పెడుతూనే, మరోవైపు అంతర్జాతీయ సమాజాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఇరాన్ కొన్ని కీలకమైన రాయితీలకు సిద్ధపడింది. ముఖ్యంగా ఐదేళ్ల పాటు బాలిస్టిక్ మిస్సైళ్ల తయారీని నిలిపివేస్తామని ప్రకటించడం ఒక సంచలనం. అణు కార్యక్రమం విషయంలో కూడా మెట్టు దిగి, యురేనియం నిల్వలను తగ్గించుకోవడంతో పాటు అంతర్జాతీయ సంస్థల తనిఖీలకు ద్వారాలు తెరుస్తామని తెలిపింది. అన్నింటికంటే ముఖ్యంగా.. హమాస్, హెజ్బొల్లా వంటి సంస్థలకు ఆర్థిక సహాయం నిలిపివేసి, ఉగ్రవాద నిర్మూలనలో భాగస్వామి అవుతామని సంకేతాలిచ్చింది.
**మిగిలి ఉన్న సందిగ్ధత: అమెరికా 15 సూత్రాల ప్లాన్ ఏంటి?**
ఇరాన్ మిలిటరీ ప్రతినిధి ఎబ్రహిమ్ వ్యాఖ్యలు చూస్తుంటే, ఈ చర్చల ప్రక్రియ అంత సులభం కాదనిపిస్తోంది. "అమెరికా తనతో తానే చర్చించుకుంటోంది" అని ఆయన చేసిన ఎద్దేవా, వాషింగ్టన్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్న ఇరాన్ అసంతృప్తిని సూచిస్తోంది. అటు అమెరికా కూడా 15 అంశాలతో కూడిన ప్రత్యేక శాంతి ప్రణాళికను ఇరాన్ ముందుంచింది. ప్రస్తుతం ఈ రెండు దేశాల మధ్య మధ్యవర్తుల ద్వారా రాయబారాలు నడుస్తున్నప్పటికీ, అధికారికంగా ఎలాంటి ముందడుగు పడలేదు. ఈ దౌత్య పోరాటంలో ఇరాన్ పెట్టిన షరతులకు ట్రంప్ ప్రభుత్వం తలొగ్గుతుందా? లేక ఇరాన్ ఇచ్చిన రాయితీలను ఆయుధంగా చేసుకుని మరింత ఒత్తిడి పెంచుతుందా? అన్నది వేచి చూడాలి.

## బ్యాంకింగ్ బకాసురులు

**చండీగఢ్ మార్చి 25:** ప్రభుత్వ ఖజానాకు కన్నం వేయడంలో కిలాడీలు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఐడీఎఫ్‌సీ బ్యాంకులో జరిగిన రూ.590 కోట్ల భారీ స్కామ్ మరువకముందే, ఇప్పుడు కోటక్ మహీంద్రా బ్యాంకులో రూ.160 కోట్ల మున్సిపల్ నిధులు మాయమవ్వడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అసలు బ్యాంకు ఖాతాలో ఉండాల్సిన కోట్లాది రూపాయలు రాత్రికి రాత్రే ఎలా మాయమయ్యాయి? ఈ కథనం చదవండి.
**మాయా స్టేట్‌మెంట్.. మాయమైన కోట్లు!**
ఈ కుంభకోణం బయటపడిన తీరు ఏదో సినిమా సీన్‌ను తలపిస్తోంది. పంచకుల మున్సిపల్ కార్పొరేషన్ తన వద్ద ఉన్న రూ.58 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఖీఐ) మెచ్యూర్ అవ్వడంతో, ఆ డబ్బును తమ రెగ్యులర్ ఖాతాలోకి మార్చమని కోరింది. బ్యాంకు నుంచి "డబ్బు జమ అయింది" అని ఒక స్టేట్‌మెంట్ కూడా వచ్చింది. కానీ, తీరా అకౌంట్ బ్యాలెన్స్ చూస్తే ఒక్క రూపాయి కూడా పెరగలేదు. లోతుగా ఆరా తీస్తే.. బ్యాంకు ఇచ్చిన ఆ స్టేట్‌మెంట్ పక్కా నకిలీ అని తేలింది! దీంతో అధికారుల గుండె ఆగింది.
**ఆడిట్‌లో తేలిన అసలు బాగోతం: రూ.160 కోట్లు గల్లంతు**
ఒక్క ఎఫ్‌డీ విషయంలోనే ఇలా జరిగితే, మిగిలిన నిధుల పరిస్థితి ఏంటని మున్సిపల్ కార్పొరేషన్ ఆడిట్ నిర్వహించింది. ఆ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. వివిధ ఎఫ్‌డీల రూపంలో ఉన్న దాదాపు రూ.160 కోట్లు రికార్డుల్లో మాత్రమే ఉన్నాయని, వాస్తవానికి ఆ నిధులు ఎప్పుడో దారి మళ్లాయని తేలింది.
**లోపాయికారీ ఒప్పందం? రంగంలోకి సీఎం!**
బ్యాంకు రికార్డులను తారుమారు చేయడం, నకిలీ స్టేట్‌మెంట్లు సృష్టించడం కేవలం బయటి వ్యక్తుల వల్ల సాధ్యం కాదు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని కొందరు అవినీతి అధికారులు, కోటక్ మహీంద్రా బ్యాంకు సిబ్బంది చేతులు కలిపి ఈ స్కామ్‌కు పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ఈ ఉదంతంపై సీరియస్ అయ్యారు. వెంటనే దర్యాప్తునకు ఆదేశించడమే కాకుండా, సదరు బ్యాంకును ప్రభుత్వ పనుల నుంచి తొలగించాలని యోచిస్తున్నారు.
**బ్యాంకు ఏమంటోంది?**
ఈ వ్యవహారంలో కోటక్ మహీంద్రా బ్యాంకు తమ తప్పు లేదని చెప్పుకోలేకపోయింది. అంతర్గత ఆడిట్‌లో లోపాలు జరిగిన మాట వాస్తవమేనని అంగీకరిస్తూ, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ప్రభుత్వ విచారణకు పూర్తి సహకారం అందిస్తామని బ్యాంకు ప్రతినిధులు ప్రకటించారు. ఒకవైపు ఐడీఎఫ్‌సీ, మరోవైపు కోటక్.. ఇలా వరుసగా ప్రభుత్వ నిధులు బ్యాంకుల నుంచి మాయమవ్వడం బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. ప్రజల సొమ్ముకు భద్రత కల్పించాల్సిన బ్యాంకులే దొంగలకు దారి చూపిస్తున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# వందేమాతరం దేశభక్తి 'పిలుపు' మాత్రమే..

**న్యూఢిల్లీ మార్చి 25:** జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించడంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టతనిచ్చింది. అధికారిక కార్యక్రమాల్లో ఈ గేయం పాడటం తప్పనిసరి కాదని, కేంద్రం జారీ చేసిన సర్క్యులర్ కేవలం ఒక 'సలహా' (ూాంజఱంశీతీఎ) మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. కేంద్ర ప్రభుత్వం జనవరి 28న జారీ చేసిన ఒక సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం విచారించింది. సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా, ఇది పరోక్షంగా ప్రజలపై ఒత్తిడి తెస్తుందని, పాడటానికి నిరాకరిస్తే సామాజిక వివక్షకు గురయ్యే ప్రమాదం ఉందని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే వాదించారు. లి కోర్టు స్పందన: ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఎక్కడా "తప్పనిసరి" అనే పదం లేదని, పాటించని వారిపై శిక్షార్హమైన చర్యలు తీసుకోనప్పుడు విచారణ అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది.
**రాజ్యాంగం – వ్యక్తిగత స్వేచ్ఛ**
"దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు" అన్న వాదనపై స్పందిస్తూ.. ఒకవేళ భవిష్యత్తులో ఎవరినైనా ఈ విషయంలో వేధించినా లేదా శిక్షించినా అప్పుడు కోర్టును ఆశ్రయించవచ్చని పిటిషనర్‌కు సూచించింది. ప్రస్తుతానికి పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు కేవలం 'ఊహాజనితమే' అని కొట్టిపారేసింది.
**వందేమాతరం: స్ఫూర్తిదాయక చరిత్ర**
ఈ వివాదం నేపథ్యంలో వందేమాతరం యొక్క చారిత్రక ప్రాధాన్యతను మరోసారి గుర్తుచేసుకోవాలి:
రచన: 1875లో బంకించంద్ర చటోపాధ్యాయ ఈ గేయాన్ని రచించారు.
తొలి ఆలపన: 1896 కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ దీనిని స్వరపరిచి పాడారు.
**ప్రాముఖ్యత:** స్వాతంత్ర్య పోరాటంలో భారతీయులందరినీ ఏకతాటిపైకి తెచ్చిన ఈ గేయంపై గౌరవాన్ని పెంపొందించడమే ప్రభుత్వ ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.
**కోర్టు తీర్పు సారాంశం**
"జాతీయ గేయం పట్ల గౌరవం ఉండాలి, కానీ అది అంతరాత్మకు సంబంధించిన విషయం. చట్టం ద్వారా బలవంతంగా అమలు చేయనంత వరకు న్యాయస్థానాలు జోక్యం చేసుకోవు."
**తెలుసుకోవాల్సిన మూడు ముఖ్య విషయాలు:**
శిక్ష లేదు: వందేమాతరం పాడకపోయినా చట్టపరమైన శిక్షలు ఉండవు.
సలహా మాత్రమే: విద్యాసంస్థలు, సభల్లో పాడాలన్నది కేవలం ప్రభుత్వ విజ్ఞప్తి మాత్రమే. కోర్టు తలుపులు తెరిచే ఉన్నాయి ఒకవేళ ఈ పేరుతో ఎవరైనా వివక్షకు గురైతే మళ్లీ పిటిషన్ వేయవచ్చు.

## ఆకాశ మార్గంలో 'వికసిత భారత్'

మరింత శక్తివంతంగా మారింది.
**10 ఏళ్ల మెగా ప్రాజెక్ట్:** 2026 నుండి 2036 వరకు రూ. 28,840 కోట్ల భారీ వ్యయంతో ఈ పథకం అమలు కానుంది.
**మౌలిక సదుపాయాల జాతర:** 100 కొత్త ఎయిర్‌పోర్టులు: రాబోయే 8 ఏళ్లలో వీటి నిర్మాణం కోసం రూ. 12,159 కోట్లు.
**200 ఆధునిక హెలిప్యాడ్‌లు:** ఒక్కోదానికి రూ15 కోట్లతో రూ. 3,661 కోట్లు.
**టైర్–2, టైర్–3 ఫోకస్:** కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాలు మరియు పర్యాటక కేంద్రాలకు నేరుగా విమాన సర్వీసులు.
**తక్కువ ఛార్జీలు – ఎక్కువ సబ్సిడీ:** విమానయాన సంస్థలకు నష్టాలు రాకుండా 'వయబులిటీ గ్యాప్ ఫండింగ్' కింద రూ. 10,043 కోట్లు కేటాయింపు.
స్మార్ట్ సరిహద్దులు: భారత పర్యటనకు వచ్చే విదేశీయుల నిర్వహణను మరింత పకడ్బందీగా మారుస్తూ (ఇమిగ్రేషన్, వీసా, ఫారినర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్) పథకానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది.
వ్యవధి: 2026 ఏప్రిల్ 1 నుండి 2031 మార్చి 31 వరకు (మరో ఐదేళ్లు).
**బడ్జెట్:** రూ. 1,800 కోట్లు.
**లక్ష్యం:** అత్యాధునిక టెక్నాలజీతో వీసా జారీ ప్రక్రియను వేగవంతం చేయడం. అక్రమ వలసల కట్టడి మరియు విదేశీయుల కదలికలపై నిఘా. ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్–2025 అమలుకు అనుగుణంగా వ్యవస్థల బలోపేతం.
**మేక్ ఇన్ ఇండియా:** స్వదేశీ విమానాల కొనుగోలు
చిన్న విమానాల కొరతను తీర్చడానికి ప్రభుత్వం ఒక కీలక అడుగు వేసింది:
**పవన్ హన్స్ కోసం:** నూూూ నుండి 2 'ధ్రువ్' హెలికాప్టర్లు.
**అలయన్స్ ఎయిర్ కోసం:** నూూూ నుండి 2 'డార్నియర్' విమానాలు.
ఇవి ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు,విపత్తు నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయి.
**ఎందుకు ఇది ముఖ్యం?** "ఇది కేవలం సాంకేతిక మార్పు కాదు, ఒక వ్యూహాత్మక మార్పు. 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంలో భాగంగా పర్యాటకం, వాణిజ్యాన్ని ప్రపం చ స్థాయికి తీసుకెళ్లడమే మా విజన్."ఉడాన్ 2.0 ద్వారా సామాన్యుడికి విమాన ప్రయాణం భారం కాకుండా చూడటం, మరోవైపు పటిష్టమైన ఇమిగ్రేషన్ వ్యవస్థతో దేశ భద్రతను కాపాడటం.. ఈ రెండు నిర్ణయాలు భారత భవిష్యత్తును మార్చనున్నాయి.

## నెలల నిత్యావసర వస్తువుల పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్.

**మెదక్,మార్చి,25,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి.** బుధవారంకౌడిపల్లి మండలం లోని కొట్టాల, వెల్మకన్య గ్రామాల్లో చౌక ధరల దుకాణాలు ఆకస్మిక తనిఖీ చేశారు. మూడు నెలల రేషన్ పంపిణీ విషయంలో పారదర్శకత జవాబి ధరతనం పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్టాక్ పరిశీలించి లబ్ధిదారులతో సంభాషించారు. చౌక ధరల దుకాణాలు సమర్థవంతంగా పనిచేయాలని లబ్ధిదారులు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువుల పంపిణీ జరగాలని ఆయన ఆదేశించారు. లబ్ధిదారులు లేవనెత్తిన ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. చౌక దుకాణాల పనితీరును పర్యవేక్షించడం, పిడీఎస్ ప్రయోజనాలు పారదర్శకంగా, సమర్థవంతంగా ఉద్దేశించిన లబ్ధిదారులకు చేరేలా చూడటం కోసం నిరంతర పర్యవేక్షణ ఉండాలని



సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానంద్ ,డీఎం సివిల్ సప్లై జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల్లో అసంతృప్తి.. నేతల్లో అయోమయం:

## 265వ డివిజన్‌లో పొలిటికల్ హీట్.

**పటాన్‌చెరు మార్చి: 25(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** రాబోయే జిహెచ్ఎంసి కార్పొరేటర్ ఎన్నికల వేళ పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని 265వ డివిజన్ – ముత్తంగి రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగిలే సూచనలు కనిపిస్తుండటంతో స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

గులాబీ గూటికి కీలక నేతలు?

పటాన్‌చెరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు దేవల్ల సంగమేశ్వర్‌తో పాటు, నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్‌కు అత్యంత సన్నిహితులుగా పేరున్న పలువురు నాయకులు త్వరలోనే బీఆర్ఎస్ (గతంలో టీఆర్ఎస్) తీర్థం పుచ్చుకోనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ముత్తంగి ఎంపీటీసీ-1 కాంగ్రెస్ అభ్యర్థులు ఎలాగరి లావణ్య, శంకర్ ముదిరాజ్ పేర్లు కూడా ఈ జాబితాలో వినిపిస్తుండటం కాంగ్రెస్ శ్రేణుల్లో కలకలం రేపుతోంది.

పెరుగుతున్న అసంతృప్తి.. పట్టించుకోని ఇన్‌చార్జి?

పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతున్న సీనియర్ కార్యకర్తలను, క్షేత్రస్థాయి నాయకులను కాటా శ్రీనివాస్ గౌడ్ నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళా నాయకులు, సీనియర్ కార్యకర్తలు తమకు గుర్తింపు దక్కడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంతర్గత కలహాలే నేతల వలసలకు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపేనా?

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆధిపత్యం



చాటుకోవడంతో అప్పటికే నిరాశలో ఉన్న కాంగ్రెస్ శ్రేణులకు, ఇప్పుడు ఈ వలసల వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేటర్ ఎన్నికల సమయానికి కార్యకర్తలను ఐక్యం చేయడంలో నాయకత్వం విఫలమైతే, అది పార్టీ మనుగడకే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.

స్పష్టత కోరుతున్న కార్యకర్తలు:

సోషల్ మీడియాలో మరియు రాజకీయ వర్గాల్లో సాగుతున్న ఈ ప్రచారాలపై సంబంధిత నాయకులు స్పందించి స్పష్టత ఇవ్వాలని సాధారణ కార్యకర్తలు కోరుతున్నారు. ఒకవేళ ఈ వలసలు నిజమైతే, ముత్తంగి డివిజన్‌లో కాంగ్రెస్ కోలుకోవడం కష్టమని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో ముత్తంగి రాజకీయ చిత్రపటం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# రుక్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు

## నేటి పిల్లలు రేపటి పౌరులు దేశ అభివృద్ధికి పునాదులు ఉప సర్పంచ్ కొలపుల రామస్వామి

**చేగుంట మార్చి 25 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల లో ఉప సర్పంచ్ కొలుపుల రామస్వామి ఆధ్వర్యంలో డోనర్ మహేష్ సహాయంతో పాఠశాలలో వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు బడి పిల్లలకు మంచి స్వచ్ఛమైన త్రాగునీరు అందించారని నా యొక్క బాధ్యత అనుకోని నేను నా కామెంట్ డొనేషన్ ద్వారా ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగినది ఇట్టి సహాయం చేసిన వ్యక్తి మహేష్ ఇతను గొప్ప వ్యక్తి ఆయన నేను హృదయపూర్వకంగా ధన్యవాదములు తెలియజేసుకుంటున్నాను ఇంకా ఎవరైనా దాతలు ముందుకు వస్తే గ్రామ సేవకుడిగా ఉంటూ పని చేస్తాను గ్రామ అభివృద్ధికి తోడ్పడతాను నేటి పిల్లలు రేపటి పౌరులు దేశ అభివృద్ధికి పునాదులు అని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మా పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ను అందించిన ఉప సర్పంచ్ కొలుపుల రామస్వామికి, మహేష్ కి , సర్పంచ్ నవీన్ కి ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంచనపల్లి నవీన్, ఉప సర్పంచ్ కొలుపుల రామస్వామి, వార్డు సభ్యులు కట్ట యాదమ్మ, అంజాగౌడ్, శ్రీరామ్,మహేష్, గ్రామ యువకులు బొల్లారపు నాగరాజు,బొల్లారపు ప్రభాకర్,చింతగింది స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపాల్, ఉపాధ్యాయురాలు రజని విద్యార్థిని విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగినది



# పెట్రోల్ బంక్ పనుల పురోగతిని పరిశీలించిన అదనపు ఎస్పీ ఎస్. మహేందర్.

**మెదక్,మార్చి,25,మెదక్ టుడే న్యూస్: ప్రతినిధి.** మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ )కి సంబంధించిన పెట్రోల్ బంక్ పనుల పురోగతిని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరిశీలించారు.బుధవారం ఆవుసులపల్లి గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంక్ పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈసందర్భంగా అక్కడి పరిస్థితులను తెలుసుకుని, అవసరమైన మౌలిక సదుపాయాలను సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు ఇంధన సౌకర్యం అందుబాటులోకి రావడం ద్వారా స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.అదనపు ఎస్పీ వెంట ఏఆర్ డియస్పి రంగా నాయక్, ఆర్ఎస్సై మహిపాల్ సిబ్బంది ఉన్నారు.



# సక్రమంగా నాణ్యమైన సన్న బియ్యం సరఫరా

## -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్,మార్చి,25,మెదక్ టుడే న్యూస్:ప్రతినిది.** సక్రమంగా నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం మెదక్ పట్టణంలో మార్కెట్ యార్డ్ దగ్గరగా ఉన్న ఎం ఎల్ ఎస్ పాయింట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో పెండింగ్ ఉన్న రేషన్ షాపులకు బియ్యాన్ని త్వరగా సరఫరా చేయాలని కలెక్టర్ సూచించారు.ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద కలెక్టర్ స్టాక్ రిజిస్టర్, ఇష్యూ రిజిస్టర్, గూడ్స్ రిజిస్టర్ రికార్డులను, ఆన్‌లైన్ రికార్డులను, వెయింగ్ యంత్రాల రిసిప్ట్‌లను పరిశీలించారు. మూడు నెలల బియ్యం సరఫరా గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జగదీష్,తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయాలి

## గ్రామ సర్పంచ్ కొండి రాజలక్ష్మి



**చేగుంట మార్చి 25 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మిస్వామి అధ్యక్షత,ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి వారితో మాట్లాడుతూ త్వరగా ఇండ్లను పూర్తి చేయాలని ఏదైనా ఇబ్బందులు ఉంటే అందరికీ నేను అందుబాటులోనే ఉంటాను మన గ్రామం మండల్ లోనే ఫస్ట్ గా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలని మన గ్రామంలో ఇంకొందరు నిరుపేదలకు రెండో విడుత అందరికీ ఇండ్లు వచ్చేలాగా మీరు త్వరగా పూర్తిచేస్తేనే మిగతా వారికి ఇప్పటికంటే మరిన్ని ఎక్కువగా ఇండ్లు తెచ్చుకోవడానికి అవకాశం ఉంటది కాబట్టి దయచేసి మీరందరూ సహకరించుకొని త్వరగా ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేయాలని వివరించారు సర్పంచ్ , పాలకవర్గం వార్డ్ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# వృద్ధ దంపతులపై సుత్తితో దాడి..

## 5 తులాల బంగారం దోపిడీ

## సంఘటన స్థలాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్

**మెదక్,మార్చి,25, శంకరంపేట్,(ఆర్), మెదక్ టుడే న్యూస్:** శంకరంపేట్ (ఆర్) పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగరాయి గ్రామంలో మధ్యాహ్న సమయంలో దోపిడి ఘటన



చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి వృద్ధ దంపతులు అంజయ్య, సావిత్రి నివాసంలోకి ప్రవేశించి సుత్తితో దాడి చేసి, వారి వద్ద ఉన్న సుమారు 5 తులాల బంగారు ఆభరణాలను దోచుకుని బైక్‌పై పరారయ్యాడు.దాడిలో గాయపడిన దంపతులను స్థానికులు వెంటనే మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఘటనపై సమాచారం అందుకున్న మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ, నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు.అదనపు ఎస్పీ వెంట డియస్పి తూప్రాన్ నరేందర్ గౌడ్, సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్సై నారాయణ గౌడ్, ఉన్నారు.

# సీఎస్ఈలో రావి దీప్తికి పీహెచ్.డీ.

**పటాన్ చెరు మార్చి :25(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని రావి దీప్తి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'వాహనాల ఇంటర్నెట్ లోకి తెలివిగా చొరబడటాన్ని గుర్తించే వ్యవస్థ (స్మార్ట్ ఇంట్రూషన్ డిటెక్షన్ సిస్టమ్) కోసం సమర్థవంతమైన అభ్యాస-ఆధారిత విధానం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.హిమబిందు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ దీప్తి పరిశోధన, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ వెహికల్స్ (ఐవోవీ) పర్యావరణ వ్యవస్థలో చొరబాటు గుర్తింపు విధానాలను బలోపేతం చేయడానికి రూపొందించిన వినూత్న అభ్యాస-ఆధారిత ఫ్రేమ్ వర్కును అందిస్తుందని తెలిపారు. సైబర్ బెదిరింపులను గుర్తించడానికి, నిరోధించడానికి అధునాతన మెషిన్ లెర్నింగ్ పద్ధతులను అన్వయించడం ద్వారా అనుసంధానించిన వాహన నెట్ వర్కుల భద్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని పెంచడం ఈ అధ్యయనం లక్ష్యమన్నారు.స్మార్ట్ ట్రాన్స్ పోర్టేషన్ సిస్టమ్ లలో సైబర్ సెక్యూరిటీ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను ఈ పరిశోధన ప్రముఖంగా ప్రస్తావిస్తోందని తెలిపారు. సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే తెలివైన చలనశీల మౌలిక సదుపాయాలు (మొబిలిటీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్లను) నిర్మించడంపై విలువైన అవగాహనను కల్పిస్తుందన్నారు. డాక్టర్ దీప్తి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం



రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరిశోధనలో, వృత్తిపరంగా ఆమె మరిన్ని విజయాలను సాధించాలని వారు అభిలషించారు.

# హమాలీల నీటి కష్టాలు తీర్చిన సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్



**చేగుంట మార్చి 25 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలోని హమాలీ సంఘం సభ్యులు ఏండ్ల నాటి నీటి సమస్యకు సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ పరిష్కారం చూపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు సమస్యను దృష్టికి తీసుకు వెళ్ళగానే వెంటనే స్పందించి బోరు పనులను ప్రారంభించారు. యువ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్ తో కలిసి పనులను పర్యవేక్షించారు. తమ ఇబ్బందులను గుర్తించి వెంటనే బోరు వేయించడం వల్ల హమాలి సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, యువ నాయకుడు శ్రీకాంత్, హమాలీ సంఘం అధ్యక్షుడు దుర్గి నరసింహులు, ఉపాధ్యక్షులు శివరాజ్, జనరల్ సెక్రెటరీ పెద్ద సోమ వెంకటేష్, కార్యదర్శి లక్ష్మణ్, సంద్రుగు నరసింహులు, సంద్రు గు శ్రీను, మురారి స్వామి, సోమ లక్ష్మణ్, తదితరులు పాల్గొనడం జరిగినది.

# దోమడుగులో 79 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

## ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్

**గుమ్మడిదల మార్చి :25(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**



నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు వార్డులో హెట్రో డ్రగ్స్ పరిశ్రమ సౌజన్యంతో 79 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, రక్షిత మంచినీటి పైపులైన్ల నిర్మాణ పనులకు బుధవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మడిదల మున్సిపల్ అభివృద్ధి కోసం ఇప్పటికే 15 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి అని తెలిపారు. అతి త్వరలో ఇందుకు సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు.రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధికి పరిశ్రమల యాజమాన్యాలు సంపూర్ణ సహకారం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యా గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దశరథ్, హెట్రో డ్రగ్స్ పరిశ్రమ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, దోమడుగు కౌన్సిలర్ రాజశేఖర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# లేఅవుట్ మార్చి కబ్జా చేస్తే వదిలేది లేదు..

## బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయండి!

**పటాన్‌చెరు మార్చి : 25మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల్లో పర్యటించిన ఆయన, దశాబ్దాల నాటి లేఅవుట్లను సైతం మార్చేసి జరుగుతున్న ఆక్రమణలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాటిఘనాపూర్‌లో 'ధరణి' మాయాజాలంపై విచారణ:

పటాన్‌చెరు మండలం పాటిఘనాపూర్‌లోని ఆనందనగర్ లేఅవుట్‌ను కమిషనర్ పరిశీలించారు. 1980లో 92 ఎకరాల్లో, 1109 ప్లాట్లతో వేసిన ఈ లేఅవుట్‌లోని రహదారులు, పార్కులు మరియు ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలను కొందరు కబ్జా చేసినట్లు గుర్తించారు. లేఅవుట్ హద్దులను చెరిపేసి, వ్యవసాయ భూమిగా చిత్రించి, ధరణి ద్వారా తప్పుడు పాస్ బుక్కులు సృష్టించిన వైనంపై బాధితులు కమిషనర్‌కు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన రంగనాథ్ గారు.. వెంటనే లేఅవుట్ ప్రకారం రోడ్లు, పార్కులను గుర్తించి ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

బీరంగూడలో ప్లాట్ల అమ్మకాలపై సీరియస్:

అమీన్‌పూర్ మండలం బీరంగూడలోని ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ సొసైటీ లేఅవుట్‌లో జరుగుతున్న అక్రమాలను కమిషనర్ పరిశీలించారు. 180 ఎకరాల్లోని ప్లాట్లను ఆక్రమించుకుని 100 గజాల చొప్పున అమ్ముతున్నారన్న ఫిర్యాదుపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ భూముల చుట్టూ వెంటనే ఫెన్సింగ్ వేయాలని అధికారులకు సూచించారు. అయితే, ఇప్పటికే ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొత్త ఆక్రమణలు జరగకుండా చూడడమే తమ ప్రాధాన్యతని కమిషనర్ భరోసా ఇచ్చారు.

నాలాను మూసేస్తే చర్యలు తప్పవు:

అనంతరం బీరంగూడలోని శంభుని కుంట అవుట్లెట్లను కమిషనర్ సందర్శించారు. వరద కాలువలను మూసేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్ల కాలనీలు మునిగిపోతున్నాయని స్థానికులు వాపోయారు. నాలాను ఆక్రమించిన నిర్మాణ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వరద కాలువలను పునరుద్ధరించి బాధ్యులపై క్రిమినల్ కేసులు బుక్ చేయాలని అధికారులను ఆదేశించారు.

కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరిక:

పరిశీలన అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. "ప్రజల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ భూములు, పార్కులు, నాలాలను ఆక్రమిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు. బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు.



# చందాయిపేట గ్రామంలో భూగర్భ నీటి సంరక్షణపై అవగాహన

**చేగుంట మార్చ్ 25, మెదక్ టుడే న్యూస్**ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా "నీరు ఒ లింగ సమానత్వం"అనే ప్రధాన థీమ్‌తో విజన్ స్వచ్ఛంద సంస్థ మరియు భూగర్భ జలావనరుల శాఖ ఆధ్వర్యంలో చందాయిపేట గ్రామంలోని రైతు వేదికలో నీటి సంరక్షణపై అవగాహన సదస్సు, ర్యాలీ ఘనంగా నిర్వహించబడింది.ప్రస్తుతం భూగర్భ జలాల మట్టం రోజురోజుకూ పడిపోతున్న పరిస్థితుల్లో, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వినియోగంపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని ఈ కార్యక్రమంలో నిపుణులు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, రైతులు, విద్యార్థులు నీటి సంరక్షణలో కీలక పాత్ర పోషించగలరని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి "నీటిని ఆదా చేద్దాం -- భవిష్యత్తును కాపాడుదాం""ప్రతి చుక్క నీరు అమూల్యశీ"నీరు ఉంటేనే జీవం ఉంటుంది "వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు.సదస్సులో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ శరత్ కుమార్ మాట్లాడుతూ భూగర్భ జలాల పరిరక్షణ కోసం ప్రతి ఇంట్లో వర్షపు నీటి నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అవసరానికి మించిన నీటి వినియోగాన్ని తగ్గించాలని, వ్యవసాయంలో మైక్రో ఇరిగేషన్ పద్ధతులు (డ్రిప్, స్ప్రింక్లర్) వినియోగించుకోవాలని సూచించారు.అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ పరమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ --భూగర్భ జలాల పునరుత్పత్తి కోసం చెరువులు, కుంటలు శుభ్రపరచడం, ఇంకుడు గుంతలు నిర్మించడం,చెట్లు నాటడం వంటి చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని వివరించారు.గ్రామ స్థాయిలో సమూహంగా ఈ కార్యక్రమాలు చేపడితే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఆదర్శ రైతులను సన్మానించి,ఇతర రైతులకు ప్రేరణగా నిలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,పాఠశాల హెడ్ మాస్టర్, పంచాయతీ సెక్రటరీ కృష్ణ,సర్పంచ్ మహేశ్వరి సాయిబాబా , ఉప సర్పంచ్, ఏఎంసీ డైరెక్టర్ తదితరులు పాల్గొని ప్రజలకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, రైతులు, విద్యార్థులు, విజన్ సంస్థ సిబ్బంది సంజీవ్, యాదగిరి, భూగర్భ జలావనరుల శాఖ అధికారులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాఘవేంద్ర కాలనీ అభివృద్ధియే మా లక్ష్యం..

## ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహకారంతో ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతాం

## సొసైటీ అధ్యక్షులు ఎం. మల్లేష్.

**అమీన్పూర్ మార్చి :25(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** రాఘవేంద్ర కాలనీ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం బుధవారం కొలువుదీరింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు శ్రీ ఎం. మల్లేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని, అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అభివృద్ధికి బాటలు వేస్తాం:

ఈ సందర్భంగా అధ్యక్షులు ఎం. మల్లేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కాలనీ సభ్యులకు, ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతుల కల్పనలో రాఘవేంద్ర కాలనీని ముందంజలో ఉంచుతానని ఆయన స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే అండదండలతో ముందుకు: "మన కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారం ఎల్లవేళలా ఉంటుంది. అలాగే అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ కూడా మనకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారిద్దరి తోడ్పాటుతో కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం" అని మల్లేష్ గారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాలనీ వాసులందరినీ సమన్వయం చేసుకుంటూ, అందరి సహకారంతో రాఘవేంద్ర కాలనీని ఒక ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు గుర్రాల జనార్దన్ రెడ్డి, కార్యదర్శి గోపి ముదిరాజ్, కోశాధికారి రమాదేవి, డైరెక్టర్లు కైల జనార్దన్ రెడ్డి, దేవి, కృష్ణవేణి మరియు రాఘవేంద్ర కాలనీ వాసులు, కాలనీ పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.





# క్యాసారం బ్రహ్మరాంబిక మల్లికార్జున స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన లో పాల్గొన్న గడీల శ్రీకాంత్ గౌడ్

**పటాన్ చెరు మార్చి : 25(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం పటాన్ చెరు మండలం క్యాసారం గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న పటాన్ చేరు మండల ఇంచార్జ్ మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ మరియు బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి ,మాజీ వార్డు సభ్యులు జోగు ధన్ రాజ్ ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బచ్చుగూడెం ప్రభాకర్ ,సయాబు శ్రీనివాస్ ,ప్రభాకర్ యాదవ్ ,సయాబు అనంతయ్య ,గ్రామ యువకులు బాల్ రాజ్ యాదవ్,నవీన్,కమలాకర్,వంశీ,మహేష్ యాదవ్,నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..



printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail. medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..